

# మనం

చిత్తూరు | తిరుపతి

శుక్రవారం 18, ఏప్రిల్ 2025

4 పేజీలు





### రెవెన్యూ సమస్యల పరిష్కారానికి

# తహశీల్దార్‌లు ప్రత్యేక శ్రద్ధతో పని చేయండి

**ప్రభుత్వ భూములను పరిరక్షించండి: జిల్లా కలెక్టర్**






(చిత్తూరు, ఏప్రిల్ 17 మనం న్యూస్): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.

గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం పై జిల్లా కలెక్టర్ జే సి జి.విద్యాధరి, డి ఆర్ ఓ కె. మోహన్ కుమార్ లతో కలసి ఆర్ డి ఓ లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ లు, తదితరులతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనన్నారు,ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తెలిపారు. మ్యుటేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పట్టా లేని భూమికి అనుభవ పత్రం కలిగిన వారికి ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.30ని తీసుకువచ్చిందని, ఈ ఉత్తర్వుల ద్వారా పట్టాలేని భూములను డిసెంబర్ 2025 లోపు క్రమబద్ధీకరణకు ప్రజలకు అవకాశం కల్పించిందన్నారు. దీని పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్ఓఆర్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఆర్డిఓ లు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్డిఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వారికి కేటాయించిన మండలాలలో భూ అలినేషన్, అసైన్మెంట్ భూమి, రెగ్యులరైజేషన్, ఆర్ఓఆర్, 22 %ఖ%, వెబ్ లాండింగ్, రీసర్వే సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. తహశీల్దార్ లు వారి పరిధిలో గల గ్రామాల వారీగా సంబంధిత వి ఆర్ ఓ లతో వెబ్ ల్యాండ్ కరక్షన్ లు, రెవెన్యూ సంబంధిత సమస్యల పై సమీక్షలు నిర్వహించడం ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. వెబ్ ల్యాండింగ్ కరక్షన్ లు చేసే సమయంలో తహశీల్దార్ లు రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే పురోగతికి సంబంధించి విఆర్ఓ లు, విలేజ్ సర్వేయర్ లతో తరచూ సమీక్షలు నిర్వహించాలన్నారు. ఈ వర్క్ షాపులో చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, ఆర్డిఓ లు శ్రీనివాసులు, భవానీ, భవానీ శంకరీ, శ్రీనివాసులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కరుణ డ్రామాలు ఆపి దమ్ముంటే గోశాలకురా..

**నీ ఆరోపణలు నిరూపించుకో..: టిడిపి ఎమ్మెల్యేలు.**

**గోవిందుని,గోమాతలపై అసత్య ప్రచారాలు ఎందుకు....?**

**వైసిపి రాజకీయ ఉనికి కోసమే... గోవుల మృతి పై ఆరోపణలు.**

**ఆరోపణలో నిరూపించలేక... పోలీసుల హౌస్ అరెస్టుల పేరుతో నాటకాలు.**

**ఎంపీ గురుమూర్తి వచ్చినట్లు.. కరుణ నువ్వెందుకు రాలేదు.**

**కరుణాకర్ రెడ్డి గోవులకు గోవిందునికి క్షమాపణ చెప్పాలి.**

**టీటీడీ చైర్మన్గా నీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తాం.... జైల్లో వేస్తాం.**



తిరుపతి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర గోశాలలో గోవుల మృతి పై టిటిడి మాజీ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి చేసిన అసత్య ఆరోపణలను నిరూపించడానికి గోశాలకు రాకుండా పోలీసుల హౌస్ అరెస్టుల పేరుతో నాటకాలు ఆడుతున్నారని టిడిపి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మురళీమోహన్ ఆరణి శ్రీనివాసులు, విమర్శించారు. గురువారం శ్రీ వెంకటేశ్వర గోశాలలో గోవుల మృతిపై కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ సవాల్ విసరడంతో నిరూపణ పరిశీలనకు డాక్టర్ థామస్, గురజాల జగన్మోహన్ నాయుడు, షాజహాన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు టిటిడి పాలక మండలి సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి, జిల్లాబిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ లు ఉదయం 9 గంటలకు గోసాల కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గోశాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు , డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. టిడిపి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి పార్టీల నాయకులు గోశాలకు చేరుకున్నారు. కానీ గోశాల మెయిన్ గేట్ వద్ద పోలీసులు ఎమ్మెల్యే లతోపాటు ముగ్గురును మాత్రమే గోశాల లోనికి అనుమతించారు. మిగిలిన టిడిపి నాయకులు రోడ్డుపైనే నిలుచుకుని ఆరోపణలను నిరూపించేందుకు కరుణాకర్ రెడ్డి వస్తారని ఎదురు చూశారు. కానీ కరుణాకర్ రెడ్డి తన స్వగృహం వద్ద మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తిలతో కలసి పోలీసులు గృహనిర్బంధం చేశారని కుంటు సాకులు చెప్తూ ఆరోపణలను నిరూపించలేక, నేలపై పడుకుని నాటకాలు ఆడుతున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఘాటు విమర్శలు చేశారు. వైసిపి రాజకీయ ఉనికి కోసం..... గోవిందుడు, గోమాతల పై అసత్య ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన టిటిడి ధార్మిక సంస్థపై నాస్తికుడైన టిటిడి మాజీ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. కరుణాకర్ రెడ్డికి దమ్ముంటే గోమాతల మృతి పై చేసిన ఆరోపణలు నిరూపించేందుకు మేము ఎలా గోశాలకు వచ్చామో.... అలాగే వచ్చి నిరూపించాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొద్దుల వెంకట సుధీర్ రెడ్డి కరుణాకర్ రెడ్డి కి సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిటిడి చైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా, టీటీడీలో కల్తీ నెయ్యి, అన్న ప్రసాదాల కల్తీ, గోశాలలో కుళ్ళిన పశుగ్రాసం, దాణా, గడువు ముగిసిన మందులు వాడారని ఆయన ఆరోపించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేసిన భూమన కరుణాకర్ రెడ్డి గోవిందునికి గోమాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మూగ జీవులైన గోమాతల పేరుతో అవినీతి అక్రమాలకు పాల్పడి టీటీడీ సొమ్మును దోచుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణ మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ గా నీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసి నిన్ను కటకటాలపాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్పర్సన్ జి నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో టిటిడి చైర్మన్గా వై వి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిలో టిటిడిని ప్రతిష్టపాలు చేశారని విమర్శించారు. కరుణాకర్ రెడ్డి వైసీపీ రాజకీయాలు చేయకుండా గోవుల శవరాజకీయాలు చేస్తున్నారని టిటిడి పాలకమండలి సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ గోశాలలో గత మూడు నెలల్లో 100 గోవులు మృతి చెందాయని ఆరోపించడానికి ఆయన ఖండించారు. . టిటిడి చైర్మన్ గా ఉన్నప్పుడు కరుణాకర్ రెడ్డి చేసిన అవినీతి అరాచకాలు చేశారని విమర్శించారు. చివరగా 12 గంటలకు తిరుపతి ఎంపీ గురుమూర్తి గోశాల మెయిన్ గేట్ కు రాగానే తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు లోనికి తీసుకుని వచ్చి గోశాలను పరిశీలింప చేశారు. ఎంపీ గురుమూర్తి వచ్చినట్లే కరుణాకర్ రెడ్డి ఎందుకు గోశాలకు వచ్చి ఆరోపణలు నిరూపించలేకపోతున్నారని టిడిపి ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ఆరోపణలు నిజం కాకపోవడం వల్లనే గోశాలకు వచ్చేందుకు కరుణాకర్ రెడ్డి భయపడి డ్రామాలాడి దాక్కున్నారని ఎమ్మెల్యేలు విమర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిప్యూటీ మేయర్, ఆర్ సి మునికృష్ణ, శ్రీధర్ వర్మ, కొండూరు బాలసుబ్రమణ్యం, చూడ చైర్మన్ కఠారి హేమలత, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు సి ఆర్ రాజన్, మబ్బు దేవనారాయణ రెడ్డి, బడి సుధా యాదవ్, జేబీ శ్రీనివాస్, గణపతి నాయుడు, కేశవులునాయుడు, జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, జనసేన పార్టీ నాయకులు రాజారెడ్డి, నరసింహ ఆచారి, పగడాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

### తూకివాకంలోని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్

# ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు భేష్

**16వ ఆర్థిక కమిషన్ బృందం**





తిరుపతి, ఏప్రిల్17: తూకివాకంలోని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక కమిషన్ బృందం కితాబిచ్చారు.

గురువారం ఉదయం తూకివాకం నందలి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితర సభ్యులు పరిశీలించగా సదరు ప్లాంట్ నందు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి ప్రిన్సిపాల్ సెక్రటరీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సురేష్ కుమార్, జే.నివాస్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య పలు అంశాలు వివరించారు. ఈ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సుస్థిర వ్యవస్థ ఏర్పాటుతో చెత్త నుండి సంపద తయారీ విధానంపై వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఏర్పడిన పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హొటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఇలా ఉత్పత్తి అయిన ఇసుక, గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రేణిగుంట చేరుకున్న 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా. అరవింద్ పనగారియా మరియు సభ్యులకు ఘన స్వాగతం

**రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన**



రేణిగుంట, ఏప్రిల్17: తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం 16 వ ఆర్థిక సంఘం చైర్మన్ డా. అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మాథ్యూ, డా. మనోజ్ పాండా తదితర సభ్యులతో కూడిన బృందానికి రేణిగుంట విమానాశ్రయం నందు ఘన స్వాగతం లభించింది. చైర్మన్ అరవింద్ పనగారియ మరియు సభ్యులకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి ఎన్. మౌర్య, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 16వ ఆర్థిక కమిషన్ బృందంతో పాటు ఉన్నారు. అలాగే ప్రిన్సిపాల్ సెక్రటరీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సురేష్ కుమార్, జె. నివాస్ అడిషనల్ సెక్రటరీ ఫైనాన్స్ వారు కూడా బృందంతో ఉన్నారు ఈ నేపథ్యంలో సంబంధిత లైజన్ అధికారులు వారికి కేటాయించబడిన సభ్యులు, డెలిగేట్స్ ను రిసీవ్ చేసుకున్నారు.





## తెదేపా పార్టీపై విశ్వసనీయతను గుర్తించి పదవి కట్టబెట్టిన అధినేత..

**పార్టీ కోసం ఎనలేని సేవలు...**

**రాష్ట్ర హజ్ కమిటీలో పఠాన్ ఖాదర్ ఖాన్ ను వరించిన పదవి..**

మదనపల్లి,ఏప్రిల్ 17, మనం న్యూస్. రాష్ట్ర హజ్ కమిటీలో అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గంలోని పోతబోలు మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, తాజ్ గ్రూప్స్ అధినేత, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త పఠాన్ ఖాదర్ ఖాన్ ను పదవి వరించింది. తెలుగుదేశం పార్టీపై నిబద్ధత,విశ్వసనీయతతో పార్టీ అభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేసిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా నియమించింది. ముస్లిం మైనారిటీల కోసం ఎల్లప్పుడు పనిచేస్తూ సామాజిక కార్యక్రమాల్లో సైతం పాల్గొంటూ అందరి చేత శభాష్ అనిపించుకున్న పఠాన్ ఖాదర్ ఖాన్ కు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంతో స్థానిక శాసనసభ్యుడు షాజహాన్ భాష శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గం నుండి రాష్ట్ర హజ్ కమిటీలో చోటు సంపాదించడం ఈ ప్రాంత ముస్లిం మైనారిటీలకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

ఎల్లప్పుడూ పార్టీ కోసం పనిచేస్తూ ఎటువంటి పదవులను ఆశించకుండా నిస్వార్థంగా పనిచేసిన నిబద్ధత కలిగిన వ్యక్తిగా పఠాన్ ఖాదర్ ఖాన్ కు గుర్తింపు ఉంది. దీంతో ఆయన్ను పట్టణంలో పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన్ను అభినందించారు. అనంతరం ఆయనను శాలువుతో సత్కరించి ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని

5లో



## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి.

**నిషేధిత మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించండి.**

**నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ గారు.**

రాయచోటి, ఏప్రిల్ 17 వ తేదీన గురువారం నాడు రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్., గారి అధ్యక్షతన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నెలవారీ "నేర సమీక్షా సమావేశం" నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలని, అలవాటు పడిన నేరస్తులకు షీట్ తెరవాలని, పెండింగ్ కేసులు త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మరోసారి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా హెచ్చరించాలని సూచించారు. చైన్ స్నాచింగ్ లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గతంలో చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేదిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక ప్రాధాన్యతతో ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి గారు, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐ లు, ఎస్ఐలు సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గోవుల గోల మానండి.. టీటీడీ ప్రతిష్టను దిగజార్చకండి

**టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి**




తిరుపతి,ఏప్రిల్ 18 : గోవుల సంరక్షణ పేరిట ఆంధ్రప్రదేశ్ లోని అధికార పక్షం, ప్రతి పక్షం ఒకరిపై ఒకరు పోటాపోటీగా చేసుకుంటున్న విమర్శలను, సవాళ్లు, ప్రతి సవాళ్లు ఆపి వాస్తవాలను భక్తులకు, ప్రజలకు తెలియజేయాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు. అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీల మధ్య సాగుతున్న వివాదం టిటిడిని అప్రతిష్ట పాలు చేసేట్టుగా ఉందని టీటీడీని నమ్ముకుని లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్న విచక్షణ కూడా మర్చిపోయి, తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కున్న చందంగా టీటీడీని తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దారుణమని అన్నారు. తిరుపతి ప్రజలు జరుగుతున్న పరిణామాల పట్ల తీవ్ర వ్యతిరేక భావంతో ఉన్నారని కందారపు మురళి వివరించారు. టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై విచారణ జరిపించడం లేదా తప్పుడు ఆరోపణలు అయితే చట్టబద్ధ చర్యలు తీసుకోవడం కాకుండా అధికార పార్టీ నాయకులే నానా యాగీ చేయటం, ఐదుగురు ఎమ్మెల్యేలు నేరుగా గోశాల వద్దకు రావడం, జన సమీకరణ చేయడం సమంజసంగా లేదని విమర్శించారు. టీటీడీలో భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు అనేకం ఉన్నాయని అలాంటి వాటిపై చర్చ జరపకుండా మూగజీవాలను అడ్డం పెట్టుకుని తమ రాజకీయ ప్రయోజనాలపై విమర్శలు చేసుకుంటూ ప్రజలలో పలుచనపడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని నిజానిజాలు వెల్లడి చేసి ఈ వివాదానికి ముగింపు పలకాలని కందారపు మురళి కోరారు. గోశాలలో గోమరణాలు జరుగుతున్నాయని ఇరుపక్షాలు చెబుతున్న నేపథ్యంలో దానికి కారణాలపై అన్వేషించి సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని ఆయన టీటీడీ యాజమాన్యానికి సూచించారు. తిరుపతి ప్రశాంతతను ప్రతిష్టను చెడగొట్టకుండా ఉభయపక్షాలు సహకరించాలని కోరారు.

# కందుకూరి విశిష్ట పురస్కారం అందుకున్న పీలేరు కళాకారుడు.



పీలేరు ఏప్రిల్ 17 మనం న్యూస్: కందుకూరివిశిష్ట పురస్కారాన్ని పీలేరుకు చెందిన ప్రముఖ బహుభాషా కళాకారుడు, పాత్రికేయుడు,సామాజిక సేవా కార్యకర్తఖాదర్ బాష షేక్ అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర,టివి నాటకరంగ అభివృద్ధి సంస్థ బుధవారం తెలుగు నాటక రంగదినోత్సవం - 2025 రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక, సినీ ఆటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్,నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ,నాటక,సినీ రచయిత బుర్ర సాయిమాధవ్, ఏపీ చలనచిత్ర,టీవీ,నాటకరంగ అభివృద్ధి మండలి చైర్మన్ హిమాంసు శుక్లా హాజరయ్యారు. నాటక రంగంలో అత్యుత్తమ సేవలందిస్తున్న కళాకారులు,సాంకేతిక నిపుణులు,రచయితలు, దర్శకులకు రాష్ట్ర ఫిలిం, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రకటించిన పురస్కారాలను వారుప్రధానం చేశారు. జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ఖాదర్ బాష షేక్ స్వీకరించారు. ఈయన గత 43 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రచార కార్యక్రమాలతో పాటుపలు సామాజిక, ప్రజా సమస్యలపై ఆధునిక వీధి నాటికలు ప్రదర్శించారు. తెలుగు,కన్నడ,హిందీ భాషల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి రంగ వేదికలపై జరిగినపలు సాంఘిక నాటిక,నాటక ప్రదర్శనల్లో పాల్గొంటూ ఓ విభిన్న నటుడిగా ప్రేక్షకుల మన్ననలు అందుకుంటున్నారు. అదేవిధంగాలఘుచిత్రాలు, సినిమాల్లోనూ నటిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.ఇప్పటికే 2000లకు పైగా ఆధునిక వీధి నాటీకలు,2500 లకు పైగా జాతీయ స్థాయిలో సాంఘిక నాటకాలు, 25కు పైగా విదేశీ రంగ వేదికలపై కన్నడ, హిందీ నాటక ప్రదర్శనలు ఇచ్చారు. రేడియో, దూరదర్శన్, ప్రైవేటు టీవీ ఛానళ్లలో ప్రసారమైన 60కి పైగా కార్యక్రమాల్లో నటించారు. అమెరికా,ఖతార్,మస్కట్, బెహ్రీన్ దేశాల్లో పలునాటక ప్రదర్శనల్లో భాగం వహించారు. సింగపూర్, కువైట్ దేశాల్లో పర్యటించారు కూడా. నాటక రంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఇది వరకే అనేక సంస్థలు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఐకాన్ అవార్డు, సర్వేపల్లె రాధాకృష్ణన్ ఎక్సలెన్సీ అవార్డు, సర్దార్ వల్లభాయ్ పటేల్ లెజెండరీ అవార్డు, ఎన్టీఆర్ లెజెండరీ అవార్డు, ఏపీజే అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారం, మదర్ థెరీసా సేవారత్న అవార్డు, గుర్రం జాషువా జీవిత సాఫల్య పురస్కారాలతోపాటు మరెన్నో ఇతర పురస్కారాలతో సత్కరించారు. గురువారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ 2025 సంవత్సరానికి తాను కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ పురస్కారోత్సవాలు ఇలాగే ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరుకుంటున్నానని ఖాదర్ బాషా చెప్పారు. తన ఈ ఉన్నతికి కారణమైన గురువులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు, మీడియా సోదరులకు ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మన మిత్ర





వెదురు కుప్పం. మనం న్యూస్ ఏప్రిల్ 17: చిత్తూరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు గౌరవ వెదురుకుప్పం మండల అభివృద్ధి అధికారి ఎల్. పురుషోత్తం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మన మిత్ర ( వాట్సాప్ గవర్నమెంట్ ) కార్యక్రమం గురించి వెదురుకుప్పం మండలంలోని అంధరు పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బందితో వెదురుకుప్పం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. మన మిత్ర కార్యక్రమ%శీ%లో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలు 9552300009 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపడం ద్వారా 224 కి పైగా పౌర సేవలను ఇంటి నుండే పొందవచ్చు అని, ప్రతి పౌరుడి ఫోనులో 9552300009 నంబరును మన మిత్ర పేరిట సేవ్ చేసుకోమని ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రాలు ఇవ్వాలని తెలియజేసారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 224 కి పైగా సేవలందిస్తున్నారని, జూన్ నెలకు 500 కు పైగా సేవలు అందించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నారని, తదుపరి దశలో 1000 కి పైగా సేవలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది అని, చదువు రాని వారు కూడా కేవలం తమ వాయిస్ మెసెజ్ ద్వారా కూడా పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఏర్పాటు చేసారని తెలియజేసారు.పౌరులందరూ తమ మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్య కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఆర్ హెచ్ వి ఎస్ జిల్లా అధ్యక్షులుగా సుందర కుమార్

**మే 14 నుంచి 26 వరకు బద్రీనాథ్ లో సరస్వతీ పుష్కరాలు**

**త్వరలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయం తిరుపతిలో ప్రారంభం**



తిరుపతి, ఏప్రిల్ 17 : రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ( ఆర్ హెచ్ వి ఎస్ ) జిల్లా అధ్యక్షులుగా కీర్తిపాటి సుందర్ కుమార్ ను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు తెలిపారు. గురువారం స్థానిక మన తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అయోధ్య ప్రధాన కేంద్రంగా ఏర్పాటైన రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ముఖ్య సంరక్షకులు మహంతు వైదేహి వల్లభ శరన్ దాస్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్ చంద్ర శుక్ల లచే నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. హిందూ సామ్రాజ్యం లో రామ రాజ్య స్థాపన కోసం, సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరాలనే సంకల్పంతో శ్రీవారి పాదాల చెంత తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్రను ఈ ఏడాదిలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రామ రాజ్య స్థాపనే ఎజెండాగా ఏర్పాటైన ఆర్ హెచ్ వి ఎస్ వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ నెలలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభమై అయోధ్య వరకు కొనసాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూపీ ముఖ్యమంత్రి వర్యులు యోగి ఆదిత్యనాథ్ లతోపాటు శ్రీలంక, మారిషస్ ప్రధానులు, నేపాల్ కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపీ అనిత దేవి సాహూ,తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉపసభాపతి రఘురామకృష్ణమ రాజు ( ఆర్ ఆర్ ఆర్) ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ మాట్లాడుతూ హైందవ ధర్మం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం, శ్రీరామ రాజ్య స్థాపన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ మహా యజ్ఞంలో తమకు భాగస్వామ్యం కలగడం దైవ సంకల్పంగా భావిస్తూ తమ వంతు శక్తివంచన లేకుండా ఆర్ హెచ్ వి ఎస్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ హెచ్ వి ఎస్ ఆధ్వర్యంలో సీతా సమేత శ్రీరామ సేవకులను అతి త్వరలో నియమించనున్నట్లు గిరి రాజు తెలిపారు. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్ర విజయవంతా నికి ఇప్పటినుంచి ప్రణాళికాబద్దం గా వ్యవహరించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ బాధ్యులు కృష్ణ కిషోర్, రాష్ట్ర అధ్యక్షులు గౌర్రె శ్రీనివాసులు,ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, టీటీడీ కాంట్రాక్టర్ గిరిరాజు లకు అభినందనలు తెలియజేశారు.

**తలసేమియా వ్యాధిగ్రస్తుడు చరణ్ కు**

# ప్రైమినిస్టర్ నేషనల్ రూ.3 లక్షలు రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించిన ఎంపి మిథున్ రెడ్డి

**రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందించిన వైసీపీ ఇంచార్జి నిస్సార్ అహమ్మద్**



మదనపల్లి, ఏప్రిల్ 17, మనం న్యూస్: రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి సహకారంతో మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లికి చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తుడు చరణ్ కు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి కింద రూ. 3 లక్షల రూపాయలు మంజూరు చేయబడిందని మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ వెల్లడించారు. గురువారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చరణ్ తాత, నానమ్మలకు రూ.మూడు లక్షల రూపాయలు మంజూరైనట్లు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి సహకారంతో రూ. 3 లక్షల రూపాయలు ముంజూరు కావడం జరిగిందన్నారు. మిథున్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. మదనపల్లె టౌన్ నీరుగట్టువారిపల్లిలో నివాసం వుండే గీతాంజలి, హరిబాబు దంపతుల కుమారుడు చరణ్ తమసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. బెంగుళూరులోని భగవాన్ మహావీర్ జైన్ హాస్పిటల్‌లో చరణ్ కు చికిత్స అందిస్తున్నారు. చరణ్ చికిత్స కోసం రూ.14 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని హాస్పిటల్ వారు తెలియజేశారు. పేద కుటుంబానికి చెందిన చరణ్ తల్లిదండ్రులకు చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో దాతల సాయం అర్ధించారు. రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి దృష్టికి తీసుకుని పోవడంతో ఆయన స్పందించి ప్రధానమంత్రి నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద రూ.3 లక్షలు మంజూరు చేయించారు. ఈ మొత్తం చరణ్ చికిత్స పొందుతున్న బెంగుళూరులోని భగవాన్ మహావీర్ జైన్ హాస్పిటల్ కు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి నిధులు జమ చేశారు. చరణ్ వైద్యానికి సంబంధించి మరింత సాయం చేయడానికి రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి హామి ఇవ్వడం జరిగిందని నిస్సార్ అహమ్మద్ తెలిపారు. ఈ మొత్తం మంజూరు పట్ల మిథున్ రెడ్డి కి చరణ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా రాజీయే రాజ మార్గము



పుంగనూరు 17 మనం న్యూస్: లోక్ అదాలత్ ద్వారా రాజియే రాజమార్గమని పుంగనూరు న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి అరీఫా షేక్ అన్నారు రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ అమరావతి వారి ఆదేశాల మేరకు మే 10న స్థానిక కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని డబ్బు సమయం ఆదా చేసుకోవాలని ఆమె కోరారు అదేవిధంగా లోక్ అదాలత్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పోషకాహారంతో గర్భవతులు,బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం

**ఐసిడిఎస్ సిడిపిఓ కే.భాగ్యమ్మ వెల్లడి**



బి. కొత్తకోట ఏప్రిల్ 17 మనం న్యూస్ : పోషకాహారంతో గర్భవతులు,బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఓ కే.భాగ్యమ్మ పేర్కొన్నారు.పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట సెక్టార్ పరిధిలోని చంద్రమాకులపల్లి అంగన్వాడి కేంద్రం నందు గర్భవతులు,చిన్నపిల్లలు తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిడిపిఓ కే.భాగ్యమ్మ మాట్లాడుతూ 100 రోజుల సంరక్షణ కింద గర్భవతులు,బాలింతలు,2 సంవత్సరాలలోపు చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారం,వారి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు.మాతా శిశుమరణాలు తగ్గించడం కోసం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే కాన్పు అయిన తర్వాత శిశువుకు మూడు సంవత్సరాలు వచ్చేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఆరోగ్య సూచనలు,ఆహారపు అలవాట్లు,అంగన్వాడీలో ఇస్తున్న ఆహారం ఎలా తీసుకోవాలో వివరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి.హిజాద్ ప్యారి,జీ.ఎం.ఎస్.కే కె.నిర్మల,ఏఎన్ఎం,ఆశా వర్కర్లు,అంగన్వాడి కార్యకర్తలు,లబ్ధిదారులైన గర్భవతులు,బాలింతలు,చిన్నారుల తల్లుల పాల్గొన్నారు.

## చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఘనంగా సన్మానించిన వైఎస్సార్ సీపీ నాయకులు



చంద్రగిరి ఏప్రిల్ 17 మనం న్యూస్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సిపి ఇన్చార్జి తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ని మాధవరెడ్డి,సిద్ధిక్ భాష ,సూరి,తదితరులు గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు.మండల బూత్ కమిటీ అధ్యక్షుడుగా దెయ్యాల మాధవరెడ్డి, మండల పార్టీ కార్యదర్శిగా సిద్ధిక్ భాష, వాలంటీర్ వింగ్ మండల అధ్యక్షులుగా సూరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు అప్పగించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఘణంగా శాలవతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీకి విధేయుడుగా ఉంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని వారు అన్నారు.చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారిని అభినందించారు.

## యంగ్ ఇండియా ఫౌండేషన్ వారిచే రేపు ఉచిత వైద్య శిబిరం



బి.కొత్తకోట ఏప్రిల్ 17 మనం న్యూస్: ఈనెల 19 అనగా రేపు (శనివారం) వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం, ఆర్టీసీ బస్టాండ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా గుండె సంబంధిత వ్యాధులు,క్యాన్సర్,దీర్ఘకాలిక కీళ్లు మరియు ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించబడునున్నారు.డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ మరియు ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించబడునున్నారు.ముఖ్యంగా ఈసీజీ,ఎకో,ముందస్తుగా క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.మరిన్ని వివరాలకు ఆర్గనైజర్లు ఎలిగెంట్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్ (అంగళ్లు) 9390262059,మమత శారీ సెంటర్ (పీటీఎం) 9110712823 మరియు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 అనే మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్ర హజ్ కమిటీ సభ్యునిగా తాజ్ హెూటల్ యజమాని పఠాన్ ఖాదర్ ఖాన్

**ఎమ్మెల్యే సాజన్ భాషా ఆధ్వర్యంలో ఘన సన్మానం**


**శుభాకాంక్షలు తెలుపిన టిడిపి నాయకులు, కార్యకర్తలు**

మదనపల్లి, ఏప్రిల్ 17,మనం న్యూస్: మదనపల్లికి చెందిన ముస్లిం మైనార్టీ



నాయకుడు, తాజ్ హెూటల్ యజమాని పఠాన్ ఖాదర్ ఖాన్ ను టిడిపి ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా ఆధ్వర్యంలో హజ్ కమిటీ సభ్యులుగా నియమితులైన పఠాన్ ఖాదర్ ఖాన్ ను టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన ముస్లిం మైనార్టీ నేత పఠాన్ ఖాదర్ ఖాన్ కు హజ్ కమిటీలో సభ్యుడిగా పదవి ఇవ్వడం మదనపల్లి నియోజకవర్గానికి ఎంతో ఆనందదాయకమైన విషయమన్నారు. నాయకులకు కార్యకర్తలకు టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని మరొకసారి రుజువైందన్నారు. అనంతరం పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ తనకు హస్ కమిటీ సభ్యునిగా అవకాశం కల్పించిన టీడీపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కు, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషాకు, టీడీపీ పార్టీ పెద్దలకు ఈ పదవ రావడానికి ముఖ్య కారణం అయిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ నాయకులు షంషీర్, వేమయ్య, నాదెళ్ల శివ, సహదేవ నాయుడు, పూలకుంట హరిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు,

## శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల జూలై నెల కోటా విడుదల



తిరుమల,ఏప్రిల్18,మనం న్యూస్:తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల జూలై నెల కోటాను ఏప్రిల్ 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం ఏప్రిల్ 19 ఉదయం 10 గంటల నుండి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన భక్తులు ఏప్రిల్ 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే వారికి టికెట్లు మంజూరవుతాయి.22న ఆర్జిత సేవా టికెట్ల విడుదలకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల జూలై నెల కోటాను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.22న వర్చువల్ సేవల కోటా విడుదల వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన జూలై నెల కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.23న అంగప్రదక్షిణం టోకెన్లు జూలై నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జూన్ నెల ఆన్ లైన్ కోటాను 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా జూలై నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల జూలై నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల తిరుమల, తిరుపతిలలో జూలై నెల గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

## మాదకద్రవ్య నివారణపై అవగాహన.. ఏస్ఐ షేక్ షేవలి




మనం న్యూస్ సదుంఏప్రిల్ 17? చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుం బస్టాండ్ ఆవరణంలో సదుం ఏస్ఐ షేక్ షేవలి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వం నిషేధిత మాధకద్రవ్యాలు చాలామనిపై , వాడకం, అమ్మకం వంటివి జరుగుతుంటే వారు క్యూ ఆర్ కోడ్ ద్వారా పోలీస్ లకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు ఈకార్యక్రమంలో పోలీస్ సిబంది స్థానికులు పాల్గొన్నారు.

## అమెరికాలో రాష్ట్ర మంత్రిగా చంద్రగిరి వాసి

### 58 శాతానికి పైగా ఓట్లతో ఆల్డర్(యంయల్ఏ) విజయం




చంద్రగిరి ఏప్రిల్ 17? చంద్రగిరిలోని టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు లంకెళ్ళ లలిత ,శ్రీరాముల కుమారుడు లంకెళ్ళ బద్రి అమెరికాలోని విస్కాన్ సిన్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో మాడిసన్ డిస్ట్రిక్ట్ -7 నందు ఆల్డర్ (యంయల్ఏ)గా 58 శాతానికి పైగా ఓట్లతో విజయం సాధించారు.మంగళవారం రాత్రి ఇస్కాన్షిన్ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 25 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటూ అక్కడే రాజకీయాలలో చురుకైన పాత్ర పోషిస్తూ వున్నారు.మాడిసన్ డిస్ట్రిక్ట్ స్థిరత్వ కమిటీలోను,మాడిసన్ మెట్రోపాలిటీన్ సేవేజ్ డిస్ట్రిక్ట్ కమిషనర్ గా స్థానం పొందారు. ఇంతటి గొప్ప స్థానాన్ని పొందిన బద్రి తల్లిదండ్రులు మాట్లాడుతూ అమెరికాలో ఘనవిజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అమెరికా భారత దేశాల మధ్య మెరుగైన సంబంధాల కోసం తమ కుమారుడు శక్తివంతం లేకుండా కృషి చేయగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.చంద్రగిరిలో పుట్టి పెరిగి ఉన్నత దేశమైన అమెరికాలో గొప్ప విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం తమకంతా ఎంతో గర్వకారణగా ఉందని స్థానికులు అన్నారు

## వైయస్సార్సీపి వాలంటీర్స్ విభాగం చంద్రగిరి మండల అధ్యక్షులుగా కే సూరి

### చెవిరెడ్డి మోహిత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు



చంద్రగిరి, ఏప్రిల్ 17 మనం న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాలంటీర్స్ చంద్రగిరి మండల విభాగం అధ్యక్షుడిగా కే సూరి నియమితులయ్యారు.ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పని చేశారు.తనపై ఎంతో నమ్మకంతో వాలంటీర్స్ విభాగంలో కీలకమైన మండల పార్టీ అధ్యక్షులుగా స్థానాన్ని అప్పగించినందుకు చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి విధేయునిగా పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని సూరి తెలిపారు.అలాగే తన రాజకీయ ఎదుగుదలకు అండగా నిలబడి తనకు పార్టీలో మంచి గుర్తింపు కల్పించిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## టీటీడీ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు



తిరుమల,ఏప్రిల్17,మనం న్యూస్:తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఆలయం ముందు శ్రీవారిని దర్శించుకున్న భక్తులతో మాట్లాడి దర్శన ఏర్పాట్లపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. లడ్డూ, అన్న ప్రసాదాలు చాలా రుచికరంగా ఉన్నాయని ఛైర్మన్ వద్ద భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఆలయంలోని దర్శన క్యూలైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తులకు కల్పిస్తున్న అన్న ప్రసాదం, తాగునీటి సదుపాయాలపై ఆరా తీశారు. క్యూలైన్లలోని భక్తులతో సేవాభావంతో నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతా రామ్, నరేష్ కుమార్, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### టిటిడి సేవలను అభినందించి

## పలు సూచనలు చేసిన ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ





తిరుపతిటౌన్, ఏప్రిల్17,మనం న్యూస్: శ్రీవారి భక్తులకు టిటిడి అందిస్తున్న సేవలపై ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తిని వ్యక్తం చేసింది. గతంలో భక్తులకు అందిస్తున్న సేవలకు, ప్రస్తుతం అందిస్తున్న సేవలలో చాలా మార్పు కనిపిస్తోందని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మెన్ వేగుల్ల జోగేశ్వర రావు వెల్లడించారు. శ్రీవారి భక్తుల సేవ నిరంతరం సేవ అని, శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా అందిస్తూ శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని సూచించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ ఛైర్మెన్ వేగుల్ల జోగేశ్వర రావు మాట్లాడుతూ, అంచనాల కమిటీ చేసిన పలు సూచనలను పరిగణలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలని సూచించారు.వైద్య సేవలపై అభినందనలు : ఇటీవల తాను శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని, అనుకోకుండా అనారోగ్యానికి గురై తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేరగా వైద్య సేవలు చాలా నాణ్యతగా, సేవాతత్వంతో అందించారని ఏపీ అంచనాల కమిటీ సభ్యులు పెన్మత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశ్విని ఆసుపత్రి సిబ్బందిని ఆయన అభినందించారు.టిటిడిలో అమలవుతున్న సేవలపై సభ్యులు సంతోషం వ్యక్తం చేయగా,

పరిశుభ్రత, పారిశుధ్యం – తిరుమలలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందుతున్నాయన్నారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు. నవతరానికి శ్రీవారి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. శ్రీవారి సేవ - రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని టిటిడి ఈవో వెల్లడించారు. వివిధ విభాగాలలో నైపుణ్యం, నిపుణుల సేవలను అన్ని విభాగాలలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఈవో తెలిపారు. అదే విధంగా తిరుమలలో క్రమం తప్పకుండా టిటిడి సేవలపై ప్రకటనలు ఇవ్వాలని, టిటిడి వసతి గృహాలలో అన్ని చోట్ల శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి అమ్మవారి చిత్ర పటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవింద నామావళిని రాత్రి 10 గం.ల వరకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, టిటిడి ఈవో సమాధానం ఇస్తూ, ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామని, మరింత పటిష్టంగా అమలు చేస్తామని ఈవో చెప్పారు. తిరుమలలో వసతి గదుల నిర్మాణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానం ఇస్తూ, కాలం చెల్లిన భవనాల స్థానంలో కొత్త భవనాలు, మరమ్మత్తులు మినహా హైకోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని ఈవో తెలిపారు. కాషన్ డిపాజిట్ ను భక్తులకు సకాలంలో చెల్లించేందుకు మరింత పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఒకరి పేరుతో వసతి గది తీసుకుని మరొకరు వచ్చి ఫేస్ రికగ్నిషన్ కోసం రావడం వల్ల చెల్లింపులో ఆలస్యం కావడం మినహా, కాషన్ డిపాజిట్ ను సంబంధిత వ్యక్తులకు సకాలంలో చెల్లింపు చేస్తున్నామన్నారు. వైకుంఠం -1, 2 లలో భక్తులకు అందిస్తున్న అత్యవసర వైద్య సేవలపై సభ్యులు అడిగి తెలుసుకున్నారు. శ్రీవాణి ట్రస్ట్ పై సభ్యులు అడిగిన సమాచారాన్ని సభ్యులకు ఈవో తెలియజేశారు. టిటిడి ఆధ్వర్యంలో చేస్తున్న స్వామివారి, అమ్మవారి రాతి విగ్రహాల తయారీ, పంపిణీ వివరాలను సభ్యులు అడగగా, ఈవో మాట్లాడుతూ, హిందూ ఆలయాలకు 5 అడుగుల లోపు స్వామివారు, అమ్మవారి విగ్రహాలను ఉచితంగా అందిస్తామని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల ప్రాంతాలలో ఉచితంగా సప్లయ్ చేస్తామని ఈవో చెప్పారు.తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ అంచనాల కమిటీ సభ్యులు శ్రీమతి భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డా. వాల్మీకి పార్థసారథి, పాశిం సునీల్ కుమార్,ఏలూరు సాంబశివరావు, శ్రీమతి వరుదు కళ్యాణి, పెన్మత్స వరాహ వెంకటసూర్య నారాయణ రాజు, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

### క్షయ, కుష్ఠు, ఎయిడ్స్, సికిల్ సెల్ అనీమియా, రక్తదానం,క్యాన్సర్,

## వడదెబ్బ ప్రజలకు అవగాహన: డాక్టర్ జులేక బేగం



వాయల్పాడు ఏప్రిల్ 17, మనం న్యూస్: మండల పరిధిలోని చింతపర్తి పి. హెచ్. సి. పరిధిలోని ఇట్లం వారి పల్లి గ్రామం లో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన ప్రజలకు డాక్టర్ జులేఖ బేగం ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ క్షయ, కుష్ఠు, ఎయిడ్స్, సికిల్ సెల్ రక్తహీనత, రక్తదానం, అందరికి క్యాన్సర్ పరీక్షలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు రెండు వారాలకు పైబడి దగ్గు ఉండుట, ఆయాసం, ఛాతిలో నొప్పి, దగ్గినపుడు గళ్ళ వచ్చుట, రక్తం గళ్ళ లో కన్పించడం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం వంటి లక్షణాలు ఉంటే అది టి. బి. జబ్బు అని అనుమానించి సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రం లో చూపించుకోవాలి. విచ్చలవిడి శృంగారం హెచ్. ఐ. వి. ఎయిడ్స్ కు నాంది. జీవిత భాగస్వామి తోనే లైంగిక జీవితం గడ పాలని అన్నారు. నొప్పి, నవ్వ, స్పర్శ లేని మచ్చలు కుష్ఠ వ్యాధి కావచ్చు కావున సమీప ఆరోగ్య కేంద్రం లో ఇటువంటి మచ్చలు ఉన్న వారు పరీక్ష చేయించుకుని ఒకవేళ నిర్ధారణ ఐతే చికిత్స పూర్తిగా ఉచితంగా ఇస్తామని అన్నారు. రక్తదానం అన్ని దానాలలోకెళ్ళ పవిత్ర మైనది. 18సంవత్సరాల పైబడిన వారు అందరు రక్తదానం చేయవచ్చు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చును. రక్తదానం చేయ డానికి యువత ముందుకు రావాలాన్నారు.18సంవత్సరాల పైబడిన అందరికి నోటి, రొమ్ము, గర్భశయ క్యాన్సర్ లపై కూడా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్లేకార్డ్స్ ప్రదర్శన చేస్తూ నినాదాలు పలుకుచు అవగాహన కల్పించారు.నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న కుటుంబం లో వారు వాడవలసిన ఉప్పు, నూనె, చక్కర పై గౌరవ ముఖ్యమంత్రి వారి సందేశం కూడా ప్రజలకు చూపించి, వినిపించడం జరిగింది.ఎండలు ఎక్కువ అవుచున్న దరిమిలా ప్రజలు వడ దెబ్బ కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఉదయం 11గం నుండి సాయంత్రం 4గం వరకు ఎండ లో తిరగరాదనీ, పనులు చేయరాదనీ తెలిపారు. ఒకవేళ వెళ్ళవలసి వస్తే గొడుగు తీసుకుని వెళ్ళాలాన్నారు. ఓ. ఆర్. ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాళన్నారు.ఈ కార్యక్రమం లో పర్యవేక్షకులు సుధాకర్, ఎమ్. ఎల్. హెచ్. పి. మౌనిక,ఏ. ఎన్. ఎమ్. రాణి, ,ఆశా కార్యకర్తలు కిరణ్, నీలావతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధత, మరియు సమర్థత అభినందనీయం.

**ఏఏఓ నుండి ఏఓ గా పదోన్నతి పొంది బదిలీ పై వెళుతున్న బి.కృష్ణుడు గారికి ఆత్మీయ వీడ్కోలు ఘనంగా సన్మాన కార్యక్రమం.**

**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ గారు.**




రాయచోటి, ఏప్రిల్ 17: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో, పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న ఏవో బి. కృష్ణుడు గారికి ఆత్మీయ వీడ్కోలు ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ గారు మాట్లాడుతూ.. నూతన జిల్లా ఏర్పడినప్పటి నుండి ఏఏఓ గా విధులు నిర్వర్తిస్తున కృష్ణుడు గారు, ఏఏఓ నుండి ఏఓ గా పదోన్నతి పొంది, గుంతకల్లు రైల్వే ఏఓ గా బదిలీపై వెళ్తున్న కృష్ణుడు గారికి అభినందనలు తెలిపారు. వారిని శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మీ విధుల నిర్వహణలో చూపిన అంకితభావం, నిబద్ధత మరియు సమర్థత అభినందనీయం. ఉన్నత పదవికి చేరుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ పదోన్నతి మీ యొక్క కృషికి, ప్రతిభకు తగిన గుర్తింపు. కొత్త బాధ్యతలను మీరు విజయవంతంగా నిర్వర్తిస్తారని నేను నమ్ముతున్నాను.బదిలీపై వెళ్తున్నప్పటికీ, మా శాఖతో మీకున్న అనుబంధం కొనసాగాలని కోరుకుంటున్నాను. మీ భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు, వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏఏఓ గా బాధ్యతల చేపట్టిన జె. త్రినాథ సత్యం గారు. పార్వతీపురం-మన్యం జిల్లా నుండి బదిలీపై వచ్చి నూతన ఏఏఓ గా బాధ్యతలు స్వీకరించిన త్రినాథ సత్యం గారికి జిల్లా ఎస్పీ గారు కొన్ని సూచనలు చేశారు. మీరు మా పోలీస్ శాఖలో నూతనంగా ఏఏఓ బాధ్యతలు స్వీకరించినందుకు నేను మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. మా బృందంలోకి మీకు స్వాగతం పలుకుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను.పోలీస్ శాఖ యొక్క పరిపాలనా వ్యవహారాలలో ఏఏఓ ఒక కీలకమైన పాత్ర పోషిస్తారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ మరియు ఇతర ముఖ్యమైన పరిపాలనా విధులను మీరు సమర్థవంతంగా నిర్వహించవలసి ఉంటుంది. మీ యొక్క సమర్థత మరియు అంకితభావం మా శాఖ యొక్క రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగడానికి ఎంతో అవసరం. మీరు ఈ బాధ్యతలను స్వీకరించిన ఈ సమయంలో, మీ ముందు అనేక సవాళ్లు మరియు అవకాశాలు ఉంటాయి. మీ యొక్క పరిపాలనా నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మరియు జట్టుతో కలిసి పనిచేసే మనస్తత్వం మా శాఖకు ఎంతో విలువైనవి.మీ యొక్క ప్రతి పనిలో నిబద్ధత మరియు నిజాయితీని పాటించండి. పోలీసు శాఖకు మీరు చేసే సేవలో విశ్వాసం ఉండాలి.

సమయానికి విలువ ఇవ్వడం మరియు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం చాలా ముఖ్యం.

మీ సహోద్యోగులతో స్నేహపూర్వకమైన మరియు సహకారపూరితమైన సంబంధాలను కొనసాగించండి. జట్టుగా పనిచేయడం ద్వారా మనం గొప్ప ఫలితాలను సాధించగలము.

ఎల్లప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడానికి మరియు మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి సిద్ధంగా ఉండండి. శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకోవాలి.

పోలీస్ శాఖలో మర్యాదగా మరియు సహనంతో వ్యవహరించండి. సిబ్బంది సమస్యలను అర్థం చేసుకుని, సాధ్యమైనంత వరకు సహాయం చేయడానికి ప్రయత్నించండి.

ఈ కొత్త ప్రయాణంలో మీకు నా పూర్తి మద్దతు ఉంటుంది. మీకు ఏమైనా సందేహాలు లేదా సహాయం కావాల్సి వస్తే, మీరు నన్ను లేదా మీ పై అధికారులను సంప్రదించవచ్చు.

మీరు మీ యొక్క విధులను సమర్థవంతంగా నిర్వర్తించి, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తారని నేను ఆశిస్తున్నాను. మీ భవిష్యత్తు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్పీ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి గారు, ఏఓ. బి.కృష్ణుడు, ఏఏఓ, జె. త్రినాథ సత్యం, డీసీఆర్బీ సీఐ యం. తులసిరాం, ఆర్ఐ లు, వి.జె.రామకృష్ణ, యం.పెద్దయ్య, ఎస్పీ గారి సీసీ, జి.ఉదయ్ కుమార్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలలో వీసీ నిర్వహించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి ఏప్రిల్ 17 మనం న్యూస్: రాయచోటి కలెక్టరేట్లోని వీసీ హాలు నుంచి సబ్ కలెక్టర్లు ఆర్డిఓ తహశీల్దార్లు డిఎల్డిఓలు మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలు డిఐఓలు ఆర్ఎస్డిటిలు సిఎస్డిటిలు మండల సర్వేయర్లు గ్రామ సర్వేయర్లు గ్రామ రెవెన్యూ అధికారులు జీఎస్డబ్ల్యుఎస్ సిబ్బంది పిఆర్ ఆర్ డబ్ల్యుఎస్ ఈఈలు పంచాయతీ కార్యదర్శులు ఏఇలు ఈపిఓ డిఈలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈ వీసీ లో రెవెన్యూ అంశాలు నిత్యావసర వస్తువుల పంపిణీ పల్లె పండుగ పనులు ఎంజిఎన్ఆర్ఈ జిఎస్ పనులు తాగునీరు జీఎస్డబ్ల్యుఎస్ అంశాలు మరియు సర్వేలు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలలో వీసీ నిర్వహించడం జరుగుతోందిఈ వీసీలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్ నైదియా దేవి డిఆర్ఓ మధుసూధన రావు ఆర్డీవో శ్రీనివాసులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోండి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**




(అమరావతి,, చిత్తూరు ఏప్రిల్,మనం న్యూస్,):ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు.గురువారం రాష్ట్ర సచివాలయం నుండి తాగునీటి సరఫరాకు సంబంధించిన వేసవి కార్యాచరణ ప్రణాళిక,స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన వేసవి కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో వేసవి నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉన్న 332 మండలాల్లోని 3వేల 438 ఆవాసాలను గుర్తించి 67.31 కోట్ల రూ.లతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేడి వాతావరణ పరిస్థితులు,వేడి గాలులు వీచే అవకాశం ఉందని కావున వేడి గాలుల పరిస్థితులను అధికమించేందుకు తగిన సంసిద్ధత ముందు జాగ్రత్త కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలక్టర్లకు సిఎస్ సూచించారు.

కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రైవేట్ తాగునీటి వనరులను అద్దెప్రాతిపదిక తీసుకుని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆదేశించారు.అంతేగాక తాత్కాలిక నీటి సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ,మరమ్మత్తులు,తాగునీటి చెరువులను నీటితో నింపడం,చేతి పంపులకు మరమ్మత్తులు నిర్వహించడం ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.రాష్ట్ర,జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ సెల్ లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో వాటిపై స్పందించి తక్షణం పరిష్కరించాలని సిఎస్ ఆదేశించారు.అదే విధంగా తాగునీటికి సంబంధించి పబ్లిక్ గ్రీవియెన్స్ రిడ్రస్సల్ సిస్టమ్(పిజిఆర్ఎస్),వివిధ ప్రసార మాధ్యమాలు,కరువు మానిటరింగ్ సెల్,కాంటాక్ట్ సెంటర్ టోల్-ఫ్రీ నంబర్ - 1902 ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి వాటిని సకాలంలో పరిష్కరించాలని సిఎస్ ఆదేశించారు.

అదే విధంగా పట్టణ ప్రాంతాల్లోను ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని జలవనరుల శాఖతో సమన్వయం చేసుకుని కాలువలకు అడ్డుకట్ట వేసి చెరుకువులకు నీటిని మళ్ళించి వాటిని పూర్తిగా నీటితో నింపాలని అన్నారు.భూగర్భ జల ఆధారిత ప్రాంతాల్లో బోర్ బావులను ఫ్లష్ చేయడం,లోతు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.చేతి పంపులు,పవర్ బోర్ లకు తక్షణ మరమ్మత్తులు నిర్వహించి అవి సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని చెప్పారు.ఇదే సమయంలో అన్నిమంచినీటి పంపిణీ లైన్లు,పంపింగ్ మెయిన్‌లను పూర్తిగా తనిఖీ చేసి నీటి లీకేజీలను అరికట్టాలని,విద్యుత్ అంతరాయం కలిగితే నీటి సరఫరాలో ఆటంకం కలగకుండా స్టాండ్ పై జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. తాగునీటికి ఇబ్బంది గల ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు.ప్రతి పట్టణ స్థానిక సంస్థలోను తాగునీటికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల సెల్ ను ఏర్పాటు చేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. అంతేగాక ధాతలు,ఇతర సంస్థల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.నీటి కాలుష్యం వల్ల వ్యాధులు ప్రభల కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు.

అనంతరం స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ఆయన సమీక్షిస్తూ ప్రతినెలా స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని సక్రమంగా నిర్వహించడం ద్వారా కార్యాలయాలు,పరిసరాలన్నిటినీ పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సిఎస్ విజయానంద్ చెప్పారు.ముఖ్యంగా వివిధ ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాల(ఇ-వేస్ట్)సక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని దీనిపై ప్రజల్లో తగిన అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వాలని తద్వారా ఈ-వ్యర్థాలను అన్ని విభాగాలలో గుర్తించి వాటిని సక్రమంగా పారవేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వారానికి ఒకసారి ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాలల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని చెప్పారు.ఈ-వ్యర్థాల ప్రాసెసింగ్‌పై సాంకేతిక సహకారాన్ని అందించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తగిన తోడ్పాటును అందిస్తారని తెలిపారు.ఈ-వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ పారవేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, కరపత్రాలు,ప్రకటనలు,సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేసి ప్రజలకు అవగాహన కలిగించాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు.

ఈవీడియో సమావేశంలో జిఏడి ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా,ఎండి ఎపిఐఐసి,పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి పాల్గొనగా వర్చువల్ గా వివిధ జిల్లాల కలక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోరుతూ పి.హెచ్.సి ఎదుట నిరసన






చౌడేపల్లి ఏప్రిల్ 17 మనం న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తూ గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో సమస్యలను ఎదుర్కొంటున్నామని రాష్ట్ర పిలుపుమేరకు గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రం ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శాంతియుత నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ గత ఆరు సంవత్సరాలుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లోని పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలన్నారు పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని సిపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలన్నారు నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని ఎఫ్ ఆర్ ఎస్ నుంచి సిహెచ్ఓ లను మినహాయింపు ఇవ్వాలన్నారు హెచ్ ఆర్ ఏ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్ఫర్ పితృత్వ సెలవులు వంటివి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాలు తర్వాత రెగ్యులర్ చేయాలన్నారు అదేవిధంగా 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నామన్నారు 2023లో ఎన్ హెచ్ ఉద్యోగులందరికీ 23% వేదన సవరణ ఇచ్చినప్పటికీ అప్పుడు తమకు వేతన సవరణ చేయకపోగా ప్రతినెల ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు ఇవ్వడంలో చేసిన తీవ్రద్యాయం వల్ల తాము కుటుంబాలు ఆర్థికమైన ఇబ్బందుల్లోకి వెళ్లిపోయామన్నారు అలాగే 2023 జూలై నుంచి ఆన్లైన్ విధానంలో చెల్లింపులు జరిపిన పి.బి.ఐ లో ఉన్నటువంటి అవగతవకలు వలన తాము చాలా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల వైద్యాధికారి పవన్ కుమార్కు అందించారు ఈ కార్యక్రమంలో మండలంలోని 14 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ఆనంద్ యాదవ్ జన్మదిన సందర్భంగా అన్నదానం

**ఆనంద్ యాదవ్ కు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆశీస్సులు**





తిరుపతి ఏప్రిల్ 17 మనం న్యూస్ : తిరుపతి పార్లిమెంట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ మరియు టౌన్ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ బిడ్డల ఆనంద్ యాదవ్ జన్మదిన సందర్భంగా స్థానిక ఆర్సి రోడ్ లోని పలని థియేటర్ సమీపంలో ఉన్న వేణుగోపాల్ స్వామి ఆలయం దగ్గర తులసి యాదవ్ యూత్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. యాదవులందరూ కలిసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు . తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, తిరుపతి మాజీ శాసనసభ్యులు మున్నూరు సుగుణమ్మ నివాసం వద్ద వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఆనంద్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా దృశ్యాలు వాళ్ళు కప్పి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సు లను అందజేశారు. ఇందులో భాగంగా డిప్యూటీ మేయర్ అర్సీ ముని కృష్ణ శుభాకాంక్షలు తెలపడం అలాగే పలువురు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో బి.జి. కృష్ణ యాదవ్ , దంపూరి భాస్కర్ యాదవ్ , అన్నా అనిత యాదవ్ , దన శేఖర్ యాదవ్ , మధు, శీను యాదవ్ , శంకర్ యాదవ్ , తులసి యాదవ్ యూత్ పాల్గొన్నారు.

# అణచివేత అధికమైతే.. తిరుగుబాటు తీవ్రమౌతుంది..

**పోరాడితే.. పోయేదేముందీ.. భానిస సంకెళ్లు తప్ప..**

**పోలీసులకు చిక్కకుండా చుక్కలు చూపించిన పార్టీ నేతలు**

**చంద్రగిరి నియోజకవర్గం నుంచి భారీగా తరలి వచ్చిన పార్టీ నేతలు**



తిరుపతి ఏప్రిల్ 17 మనం న్యూస్: రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ఇచ్చిన సవాల్ ను జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్వీకరించారు. గురువారం గోశాలలో గోవుల మరణాలపై నిజ నిర్ధారణకు భూమన కరుణాకర్ రెడ్డి బయలుదేరుతుండగా ఆయన వెంట వెళ్లడానికి పార్టీ క్యాడర్ తరలి రావాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. మోహిత్ రెడ్డి పిలుపు మేరకు ప్రతి గ్రామం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు తిరుపతి గోశాలకు బయలుదేరారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకులు తిరుపతి వస్తున్నారని ఇంటలిజెన్స్ వర్గాల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు గోశాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తెచ్చి అక్కడకు ఎవ్వరూ రాకూడదని హుకుం జారీ చేశారు. అయినా ఏ ఒక్కరు లెక్క చేయలేదు.. మాన నాయకుడు రమ్మన్నాడు.. మేమొస్తున్నామని అడుగులు ముందుకేశారు.. ప్రతి అడుగు గోశాల వైపు పడటంతో పోలీసులు ఆ దారులన్నీ మూసి వేశారు. మండల స్థాయి నేతలను చాలా చోట్ల ఇళ్ల వద్దనే అడ్డుకున్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని సైతం పోలీసులు గోశాల వద్దకు రానీయకుండా అడ్డుకోవడంతో ఆయన వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు అండగా నిలిచారు. అంతేకాదు పోరాడితే పోయేదేముంది భానిస సంకెళ్లు తప్ప అంటూ అడ్డంకులను తెంచుకుని ముందుకు వచ్చారు. అణచివేత ధోరణితో పోలీసులు అధికంగా మితిమీరడంతో తిరుగుబాటు చేశారు. భూమన నాయకత్వంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపుతో భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలతో పద్మావతీపురం జనంతో నిండుకుంది. చాలా మంది పార్టీ నేతలు పోలీసుల చేతికి చిక్కకుండా చుక్కలు చూపించి భూమన ఇంటికి చేరుకోవడం విశేషం. చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పోరాట యోధులని మరోసారి ఇలా రుజువు చేసుకున్నారు.

# పోరాటానికి తరలివచ్చిన వారందరికీ కృతజ్ఞతలు



చంద్రగిరి ఏప్రిల్17మనం న్యూస్:చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో వందలాదిగా పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. సూర్యోదయానికి ముందే అన్ని మండలాలు, పంచాయతీల్లో ముఖ్యమైన నేతల ఇళ్లకు చేరుకున్న పోలీసులు గృహ నిర్బంధం చేసినా సరే ఏ ఒక్కరు వెనుకంజ వేయలేదు. మన నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి గారి వెన్నంటి నడవడానికి, పోరాటం చేయడానికి ఏ మాత్రం వెనుకంజ వేయకుండా పోలీసుల నిర్బంధాలను తెంచుకుని తిరుపతి చేరుకున్నారు. గోశాల వద్ద పోలీసులు అన్ని దారులను మూసి వేసినా సరే లెక్క చేయకుండా మన నాయకుడు భూమన గారి ఇంటికి చేరుకుని మా అందరికీ అండగా నిలబడ్డారు. పోరాటానికి మేముసైతం అంటూ చేతులు కలిపి పోలీసుల అడ్డంకులను తెంచేందుకు ప్రయత్నించారు. భూమన గారితో పాటు పార్టీ ముఖ్యనేతలకు వెన్నుదన్నుగా నిలబడ్డారు. నాపై నమ్మకం, మన నాయకుని పోరాటానికి చంద్రగిరి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా...

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు.



చౌడేపల్లి ఏప్రిల్ 17 మనం న్యూస్: మండలంలోని కడియాల కుంట ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు బెంగళూరుకు చెందిన వేణుగోపాల్ (55)సదుము వద్దగల తిమ్మా నాయన పల్లి కి తమ బంధువులు ఇంటికి టు వీలర్ పై వెళుతూ ఉండగా కడియాల కుంట ఆంజనేయస్వామి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో టూవీలర్ ను ఢీకొన్నాడు ఈ ప్రమాదంలో వేణుగోపాల్ తో పాటు మరో టూ వీలర్ కు చెందిన మండలంలోని లదిగాం రెడ్డప్ప (58)షఫీ(30) లకు గాయాలయ్యాయి వారిలో షఫీ కి చెయ్యి విరిగిపోగా వేణుగోపాల్ కు తీవ్ర గాయాలయ్యాయి గాయపడ్డ వారందరిని 108 సేవల ద్వారా స్థానిక పోలీసులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కాగా 108 ఆలస్యంగా రావడంతో చౌడేపల్లికి చెందిన సీనియర్ విలేకరి కడియాల మహేష్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు.

## పుంగనూరు సిఐగా సుబ్బారాయుడు



పుంగనూరు ఏప్రిల్ 17 మనం న్యూస్ : పుంగనూరు సిఐ గా సుబ్బారాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు గతంలో ఇక్కడ పనిచేసిన సిఐ శ్రీనివాసులు సస్పెండ్ అయిన విషయం విధీతమే దీంతో తిరుపతి టాస్క్ ఫోర్సులో విధులు నిర్వహిస్తున్న సుబ్బారాయుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడికి బదిలీ అయ్యారు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సుబ్బారాయుడు తెలిపారు.

## విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్.



చిత్తూరు/ బంగారుపాలెం. ఏప్రిల్ 17. మనం న్యూస్: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని ఉషోదయ ప్రాంగణంలోని విజయవాడ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులను గురువారం పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు. శ్రీ చైతన్య విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన పోటీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారు సాధించిన ట్యాబ్ గోల్డ్ మెడల్ సర్టిఫికెట్లను బహుకరించి అందరికీ అభినందనలు తెలిపారు. ఏజీఎం సురేష్, ఆర్ ఐ కె చక్రధర్, ప్రిన్సిపల్ కేసి ప్రతిమ అకాడమిక్ డీన్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ‘రియల్’ రాజు...!!

**హైటెన్షన్ భూవివాదంతో రాటు దేలాడు**

**భూ కబ్జాదారులకు ఎదరొడ్డి భూమిని కాపాడుకున్న రియల్టర్**



కురబలకోట, ఏప్రిల్ 17, మనం న్యూస్: నిజ జీవితంలో రీల్ హీరోలు వేరు..రియల్ హీరోలు వేరు. రీల్ హీరోలు సినిమాల్లోనే హీరోలు. రియల్ హీరోలు మాత్రం జనంలో ఉంటారు. తన భూమినే తాను కాపాడుకోడానికి ఎందరినో ఎదిరించి మరికొందరితో ఎదురొడ్డి ధైర్యంగా నిలబడ్డాడు రాజు. ఇతని పూర్తి పేరు వి. వెంకటరమణ రాజు ఇతను రియల్టర్, ఇతనిది మదనపల్లె. ఆంగళ్లు పరిసర ప్రాంతాల్లో రియల్ భూమ్ రావడానికి ఇతనే ప్రధాన కారకుడు. తొలుత ఇతను ఇక్కడ భూములు కొని అమ్మడం ద్వారా ఒక్కసారిగా రియల్ భూమ్ నడచింది. లక్షలున్న భూములు ఒక్కసారిగా కోట్లకు చేరాయి. అంతే స్థా యిలో భూ వివాదాలు కూడా ఎదురయ్యాయి. ఇతను 2016లో అంగళ్లులో సర్వేనెంబర్ టూట్వంటీలో ఐదన్నర ఎకరం కొన్నారు. ప్లాట్లు వేసి 72 మందికి విక్రయించారు. హైవే పక్కనున్న ఈ భూమిపై కొందరు ఫేక్ డాక్యుమెంట్లుతో కన్నేశారు. దౌర్జన్యంగా ఆక్రమించే యత్నం చేశారు. వరుసగా తొమ్మిదేళ్ల పాటు భూ వివాదాలు ఎదుర్కొన్నాడు. ఒకరు పోతే ఒకరు ఇక్కడ దాదాగిరి చెలాయించారు. అందరిని ఎదుర్కొన్నాడు. ఇందుకు అతని వద్ద పక్కా రికార్డు ఉండడమే ప్రధాన కారణం. ఇతరులైతే మనో వ్యాధికి గురయ్యేవారు. కుంగిపోయే వారు కూడా. బలవంతులతో కూడా పోరాడాడు. ఇటీవల ఒకరు ఏకంగా చుట్టూ పెన్సింగ్ వేసి అక్రమంగా ఇతని భూమి ఆక్రమించారు. అంతే స్పీడుగా రాజు ఈ భూమికి వేసిన ఫెన్సింగ్ ను ధ్వంసం చేయడంతో పాటు నేల మట్టం చేయించారు. భూ ఆక్రమణదారులకు బుద్ధి చెప్పారు. మళ్లీ ఈ భూమి వైపు తలెత్తి చూడకుండా ప్రత్యర్థికి చావు దెబ్బ కొట్టారు. ఇప్పుడు రాటు దేలాడు. గురువారం కూడా పుంగనూరుకు చెందిన కొందరు ఈభూమి తమదే నంటూ ఆక్రమించే యత్నం చేశారు. మళ్లీ తనదైన శైలిలో భూ దురాక్రమణను ఎదుర్కొని ప్లాట్లు కొన్న వారిలో ధైర్యం నింపారు. దమ్మున్న వాడిగా పేరు తెచ్చుకున్నారు. ముందు చూపు, ఆలోచన, లౌక్యం, శక్తియుక్తులతో ముందుకు సాగే ఇతన్ని రియల్ ఎస్టేట్ లో రాటుదేలిన వ్యక్తిగా చెప్పుకుంటున్నారు.

## సిహెచ్ఓ లు తమ డిమాండ్ల సాధనకై నిరసన కార్యక్రమం



వి కోట ఏప్రిల్ 17 మనం న్యూస్ : మండల పరిధిలోని ఓగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిహెచ్ఓ లు గురువారం తమ విధులను బహిష్కరించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ మాధవికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సామూహికంగా అందరూ సెలవు పెట్టి తమ విధులు బహిష్కరించినారు. గత రెండు సంవత్సరాలుగా వారి డిమాండ్లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరించడం పై ఈ నిరసన చేస్తున్నట్లు వారు తెలిపారు. వారిని ఉద్యోగులగా కాకుండా కనీసం మనుష్యులుగా కూడా గుర్తించడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. వారి వేతనాల పట్ల స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాచే సేవలు చేయించుకుంటూ, ప్రభుత్వం మా సేవలను గుర్తించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమములో అందరూ సి హెచ్ ఓ లు పాల్గొన్నారు.

## సత్యవేడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా రామచంద్రయ్య ఎన్నిక



సత్యవేడు, ఏప్రిల్ 17,మనం న్యూస్. తిరుపతి జిల్లా సత్యవేడు ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా సీనియర్ పాత్రికేయులురామచంద్రయ్య( విశాలాంధ్ర) ఎన్నికయ్యారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా సోమసుందరం( శ్రీసిటీ ఆంధ్రప్రభ),గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసరావు( సాక్షి),గౌరవ సలహాదారులుగా సీనియర్ పాత్రికేయులు రవి,ప్రధాన కార్యదర్శిగా సలీంభాష( ఆంధ్రజ్యోతి),సహాయ కార్యదర్శిగా అనిల్ కుమార్( ప్రజాశక్తి) తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.మూడోసారి నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రయ్యకు కార్యవర్గ సభ్యులు సాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం.

శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 17,మనం న్యూస్. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు గురువారం పల్లెల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆరవ తరగతి ప్రవేశం కొరకు జిల్లా పరిషత్ ఓబులాయిపల్లి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎర్రం రెడ్డి పల్లి రెడ్డిపల్లి ఓబులాయిపల్లి గిరిజన గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాధిక్ భాష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఉచిత మధ్యాహ్న భోజన పథకం ఉచితంగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ స్కాలర్షిప్లు అందిస్తున్నారని నాణ్యమైన విద్య కొరకు ప్రభుత్వ పాఠశాలలోనే ప్రవేశం పొంది ఉన్నత విద్యలు అభ్యసించాలని తల్లిదండ్రులను విద్యార్థులను కోరారు ఎర్రమరెడ్డిపల్లి రెడ్డిపల్లి ఓబులాయిపల్లి గిరిజన కాలనీల నుండి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను సుమారు 15 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో ప్రవేశం కొరకు తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీ కాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటికి అధిక ప్రాధాన్యత.. సర్పంచ్ గోవింద్



వెదురు కుప్పం మనం న్యూస్ ఏప్రిల్ 17 : వెదురు కుప్పం మండలం బొమ్మయ్య పల్లి పంచాయతీ రామకృష్ణాపురం వంటిల్లు లో తాగునీటికీ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని బొమ్మయ్యపల్లి సర్పంచ్ గోవింద్ అన్నారు.. బొమ్మయపల్లి పంచాయతీ రామకృష్ణాపురం వంటిల్లు గ్రామానికి త్రాగినీటి బోరు మోటర్ మరమత్తు గురవడంతో వంటిల్లు గ్రామస్తులు సర్పంచ్ గోవింద్ కు తెలియజేయడంతో వెంటనే సర్పంచ్ గోవిందు సుమారు 50 వేల రూపాయలతో నూతన బోరును మోటార్ ఏర్పాటు చేయడం జరిగింది. రామకృష్ణాపురం వంటిల్లు గ్రామానికి త్రాగునీరు సమస్య పరిష్కరించడంతో గ్రామస్తులు సర్పంచ్ గోవింద్ సేవ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## చలివేంద్రం ను ప్రారంభించిన బొజ్జల రిషితా రెడ్డి.



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17,మనం న్యూస్. యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుచేసిన చలివేంద్రంను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడ వచ్చిన మహిళలకు, వేసవి తాపం తీర్చడానికి మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పేట శేఖర్ ను అభినందించారు. ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంఠ రమేష్, మహిళ అధ్యక్షురాలు సుమతి,నాయకులు వివేక్, రమేష్ బాబు, భాస్కర్ గౌడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మీడియో కోఆర్డినేటర్ గా నాగమల్లి దుర్గాప్రసాద్



శ్రీకాళహస్తి మనం న్యూస్ ఏప్రిల్ 17: శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ గా మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ ను నియమించారు. ఆ మేరకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రకటించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో చర్చించి నియామకాన్ని ఖరారు చేశారు. మీడియాకు సంబంధించిన వ్యవహారాలను చూసుకునేలా బాధ్యతలు అప్పగించారు. సౌమ్యుడు, వివాదారహితుడు తెలుగు యువత పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం నేపథ్యంలో మీడియాతో కలిగిన సన్నిహిత సంబంధాలు ఈ పదవి రావడానికి కారణమైంది. మీడియా కోఆర్డినేటర్ గా ఎన్నికైన దుర్గాప్రసాద్ ను ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఎమ్మెల్యే కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తానని తెలిపారు. అలాగే విలేకరుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పాత్రికేయల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే అప్పగించిన ఈ బాధ్యతలను అంకితభావంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లుకు దరఖాస్తు చేసుకోండి...

### ఎస్ఆర్ పురం ఎంపీడీవో జై మోహన్ మురళి తెలిపారు..



ఎస్ఆర్ పురం ఏప్రిల్ 17 (మనం న్యూస్).. ఎస్ఆర్ పురం మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకొనవలసినదిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి జై మోహన్ మురళి గురువారం తెలియజేశారు , అర్హులు ఎస్సీ కులానికి చెంది న వారు 21 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయసుగల వారు అర్హులని తెలియజేశారు, సదరు దరఖాస్తులు ఏపీ ఓబి ఎంఎంఎస్ సైట్ ద్వారా మే 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వి్ని చేసుకోవాలని కోరడం జరిగింది...

## జాతీయ నాయకులు విగ్రహాలు సంఘ విగ్రహాలు ప్రముఖుల విగ్రహాలు శిథిలావస్థకు గురి కాకుండా విగ్రహాలకు తగు చర్యలు తీసుకోండి



రాయచోటి ఏప్రిల్ 17 మనం న్యూస్ అన్నమయ్య జిల్లా రాయచోటి నందు మున్సిపల్ కమిషనర్ గారిని కలిసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘాల నాయకులు కలిసి రోడ్డు మధ్యలో ఉండు వివిధ జాతీయ నాయకులు విగ్రహాలు సంఘ విగ్రహాలు మరియు ప్రముఖుల విగ్రహాలు శిథిలావస్థకు గురి కాకుండా ఆ విగ్రహాలకు తగు చర్యలు శుభ్రతను చేపట్టాలని కోరినారు. కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు డి పద్మ గారు వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ బి చిన్న రెడ్డి యూత్ ప్రెసిడెంట్ వై శరత్ కుమార్,యోగానంద బాబు పి జయరాం వలి భాష మరియు సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు

## అటవీ శాఖ అధికారుల అదుపులోకి చిరుతను చంపిన నిందితులు



అన్నమయ్య జిల్లా మదనపల్లె : చిరుత పులిని చంపిన నిందితులను అటవీ శాఖ అధికారులు గురువారం ఎట్టికేలకు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం, పొన్నెటి పాలెం వద్ద మంగళవారం రాత్రి అడవి పందులకు తీసిన ఉచ్చులో చిక్కుకొని బుధవారం నరకయాతన పడి చిరుత పులి చనిపోవడం తెలిసిందే. ఈ ఘటనలో అడవి పందులను వేటాడేందుకు ఉచ్చులు బిగించిన ముగ్గురు నిందితులను మదనపల్లి అటవీ శాఖ అధికారులు ఎట్టి కేలకు అదుపులోకి తీసుకొని విసారిస్తున్నారు..

## పోలీసుల గృహ నిర్బంధంలో వైకాపా మండల కన్వీనర్ సింహాల మోహన్

### మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టిన సి ఈ ఇమ్రాన్ భాష



చిన్నగొట్టిగల్లు ఏప్రిల్ 17 మనం న్యూస్ : తిరుపతి గోశాలలో ఉన్న గోవులు మృతి చెందాయన్న సంఘటనలు రెండు రోజులు గా దుమారం లేపడంతో అప్రమత్తం అయిన భాకారాపేట పోలీసులు ఎట్టకేలకు వై కా పా కు చెందిన మండల కన్వీనర్ సింహాల మోహన్ ను గృహ నిర్బందం చేశారు.రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ విసిరిన సవాల్ ను, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్వీకరించడంతో గోశాలలో గోవుల మరణాలపై నిజ నిర్ధారణకు భూమన కరుణాకర్ రెడ్డి బయలుదేరుతుండగా, ఆయన వెంట వెళ్లడానికి పార్టీ క్యాడర్ తరలి రావాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, ప్రతి గ్రామం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు తిరుపతి గోశాలకు బయలుదేరారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకులు తిరుపతికి వస్తున్నారని ఇంటలిజెన్స్ వర్గాల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు గోశాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తెచ్చి అక్కడకు ఎవ్వరూ రాకూడదని హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో చిన్నగొట్టిగల్లు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా సీఐ ఇమ్రాన్ భాష, ఎస్ ఐ రాఘవేంద్ర ల సంయుక్త ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పోలీస్ సేవలు బేషుగ్గా ఉన్నాయంటూ పలువురు వ్యాఖ్యానించడం మండలంలో చర్చనీయంసంగా మారింది.

## తెదేపా పార్టీపై విశ్వసనీయతను గుర్తించి పదవి కట్టబెట్టిన అధినేత..

(మొదటి పేజీ తరువాయి)



ఉన్నత పదవులు చేపట్టాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ తనకు గతంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను గుర్తించి సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారని, తర్వాత ముస్లిం మైనారిటీల సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర హజ్ కమిటీలో స్థానం కల్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఒక ముస్లిం మైనార్టీ వర్గానికే కాకుండా అన్ని కుల,మతాలను సంప్రదాయాలను గౌరవిస్తూ ముస్లిం,హిందువులకు, క్రిస్టియన్స్ కు సంబంధించిన పండుగలలో, ఇతర ఇతర కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే వాడు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే షాజహాన్ భాషకు, పార్టీ పెద్దలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మాలలు పంతం.. చంద్రబాబు పాలన అంతం

### రాజ్యాంగ వ్యవస్థను కూ ల్చడానికి ఎన్డీఏ ప్రభుత్వం దోహదపడుతుంది


### జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

### మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమాల సుదర్శనం



మదనపల్లి, ఏప్రిల్ 17, మనం న్యూస్: భారతదేశంలో బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వ్యవస్థను కూల్చడానికి ఎన్డీఏ ప్రభుత్వం దోహదపడుతుందని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమాల సుదర్శనం ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మదనపల్లి పట్టణంలోని స్థానిక గాంధీ రోడ్ లోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యమాల సుదర్శనం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకపక్ష ధోరణి వ్యవహరించడం బాధాకర విషయం మనీ అన్నారు. చంద్రబాబు నాయుడు ఒకే కులానికి మద్దతు ఇవ్వడం చాలా బాధాకరం, అందులో భాగంగానే స్థానిక ఎన్నికల్లో మాలల పంతం చంద్రబాబు పాలన అంతం నినాదంతో టిడిపి అభ్యర్థులను ఓడిస్తామని ఆయన హెచ్చరించాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశంలో ఉన్న కులాలకు అనుగుణంగా రాజ్యాంగం నిర్మించి పాలకుల చేతుల్లో పెట్టడం జరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత రాజ్యాంగాన్ని అనేక దేశాలలో గౌరవిస్తున్న ఒక భారతదేశంలో మాత్రం అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పడేవిధంగా చట్టాలను అమలు చేయడానికి తొందర పడుతున్నారని ఆయన మండిపడ్డారు. 2024 ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్ర చూడ్ ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. చంద్రబాబు మరింత ముందుకు అడుగులు వేస్తూ అధికరణ 383 ప్రకారం జాతీయ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి కమిషన్ లు వేయరాదని పేర్కొన్నారు. మాల సమాజ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎస్సీ వర్గీకరణపై స్పందించకపోవడం దారుణం అన్నారు. తెలంగాణలో 1 శాతం రెల్లి, మాదిగలు 9 శాతం, 5 శాతం మాల సామాజిక వర్గాలకు విభజన చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో మాలలు 90 లక్షలు పై చిలుకు ఉన్నారని ఏ పాటి నిష్పత్తినిచ్చారో మాలలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రూపు1 రెల్లి వాటి 12 ఉప కులాలకు ఒక శాతం, గ్రూప్ 2మాదిగ ఉపకళాలకు 18కు 6.5 శాతం, గ్రూప్ 3 మాల 29 ఉప కులాలకు 7.5 శాతంగా విభజించడం జరిగింది అన్నారు. ఇది ఏ పాటి విభజన. పాలకుల వక్రబుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యమాల చంద్రయ్య,గుండా మనోహర్, వీరనాల మాణిక్యం, ఎలక్ట్రిషన్ మోహన్ ,పలమనేరు జయశంకర్, గంగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మునిరెడ్డి మృతి.



బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 17,మనం న్యూస్.భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వి ముని చంద్రారెడ్డి తండ్రిగారైన వి మునిరెడ్డి గురువారం మృతి చెందారు. వరత్తురు గ్రామం లోని ఆయన పార్థివ దేహానికి పలవురు బీజేపీ, టీడీపీ, నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

## నేడు సాకిరి సాయి కార్తీక్ కు దహనక్రియలు

### శోక సంద్రంలో భాకరాపేట స్వగ్రామం




చిన్నగొట్టిగల్లు ఏప్రిల్ 17మనం న్యూస్ :భాకరాపేటకు చెందిన రష్యా డాక్టర్ మనస్వీ సాయి కార్తీక్ (28) మృతి చెందడంతో ఆయన దహన క్రియలు ఆయన స్వగ్రామమైన భాకరాపేటలో నిర్వహించబడునని సర్పంచ్ సాకిరి భూపాల్ తెలిపారు. సర్పంచ్ భూపాల్ కు సొంత చిన్నాన్న అయినా సాకిరి శివమూర్తి మహాలక్ష్మి( రిటైర్డ్ టీచర్స్) ల ఏకైక కుమారుడు సాకిరి మనస్వి సాయి కార్తీక్ రష్యాలో డాక్టర్ గా కొనసాగుతున్నాడు. అయన ఏప్రిల్ 12 శనివారం మృతి చెందడంతో ఆయన మృతదేహం గురువారం రాత్రి భాకరాపేటకు చేరుకుంది. 18వ తేదీ శుక్రవారం అనగా నేడు మధ్యాహ్నం 12 గంటలకు ఆయనకు దహన సంస్కారాలు జరుగుతాయని సాకిరి కుటుంబీకులు తెలిపారు. మృతదేహం స్వగృహానికి చేరుకోవడంతో భాకరాపేట గ్రామస్తులు బాధాతప్త హృదయాలతో కన్నీటి పర్యాంతమై కన్నీరు మున్నీరైయ్యారు.

## చంద్రగిరి మండల వైయస్ఆర్ సిపికమిటీ నియామకం:కొట్టాల చంద్రశేఖర్ రెడ్డి..!



చంద్రగిరి, ఏప్రిల్ 17 మనం న్యూస్:: చంద్రగిరి మండల వైయస్ఆర్ సిపి మండలకమిటీని పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకుమాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అధ్వర్యములోమండల కమిటీ నియమించినట్లు మండల అధ్యక్షుడు కొట్టాల చంద్రశేఖర్ రెడ్డితెలిపారు. వైయస్ఆర్ సిపి ఉపాధ్యక్షులుగాచంద్రశేఖర్ రెడ్డి,కే.సురేష్ యాదవ్,ఎన్. చంద్రశేఖర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శులుగాబాలకృష్ణ,మురగయ్య,గోపాల్ యాదవ్,ఆర్.ఎస్.మస్తాన్,కార్యదర్శులుగా బి.కే. వినోద్,అహ్మద్ బాషా,మాతయ్య,మోహన్ నాయుడు,సిద్దిక్ భాష, టి.రాజామునీంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగావి.గురువారెడ్డి,బద్వేల్ నాగరాజ్,ముని రాజా,నాగభూషణం రెడ్డి,ఆనందయ్య,కృష్ణమూర్తి నాయుడు,శివకోటి, బాలాజీ,యన్.రాజయ్యను పార్టీఅధ్యక్షులువై.యస్.జగన్ మోహన్ రెడ్డిఆదేశాల మేరకుమండల పార్టీకమిటీని నిర్మించి

## రాయచోటి కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు.




రాయచోటి – అన్నమయ్య జిల్లా: గురువారం ఉదయం విజయవాడ ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, త్రాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎమ్ఈల సర్వే మరియు నియోజకవర్గాలలో ఎంఎస్ఎమ్ఈ పార్కు ల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గారు.రాయచోటి కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు.

## మదనపల్లె ఫారెస్ట్ కార్యాలయ్యంలో విచారణ చేపట్టిన ఫారెస్ట్ చీఫ్ కంజర్వేటర్ సెల్వం

అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలంలోని పొన్నేటి పాలెం వద్ద మంగళవారం రాత్రి వేటగాళ్ల ఉచ్చులో చిక్కి నరకాయాతనతో బుధవారం చనిపోయిన గర్భిణీ చిరుత పులి ఘటన రాష్ట్రంలో సంచలనం రేకెత్తించడం పాఠకులకు తెలిసిందే. ఘటనపై విచారణ నిమిత్తం అన్నమయ్య, కడప, నెల్లూరు, తిరుపతి జిల్లాల అటవీ సంరక్షణ ముఖ్య అధికారి ( చీఫ్ కన్జర్వేటర్) సెల్వం గురువారం రాత్రి మదనపల్లె ఫారెస్ట్ కార్యాలయానికి చేరుకున్నారు. సిబ్బందిని ఒక్కొక్కరిన్నే పిలిచి చిరుత పులి మృతి ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ కేసులో మంగళవారం వన్యప్రాణుల కోసం ఉచ్చులు బిగించిన వేటగాళ్లని ముగ్గురిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరెవరు పార్థ పాత్ర ఉందో నిగ్గు తెల్చేందుకు సిఎఫ్ రంగంలోకి ద్దిగి విభిన్న కోణాల్లో లోతుగా దర్యాప్తు చేపట్టారు

## ఉచ్చులోపడి చిరుత బలి కావడంపై విచారణ

### ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ ఆదేశం



అన్నమయ్య జిల్లా పొన్నూటిపాళెం సమీపంలో ఉచ్చులో చిక్కుకొని చిరుత బలయిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కల్యాణ్ గారు ఆదేశించారు. ఈ మేరకు పి.సి.సి.ఎఫ్. శ్రీ చలపతిరావుని విచారణ అధికారిగా నియమించారు. పొన్నూటిపాళెం వద్ద ఆడ చిరుత ఉచ్చులోపడిపోయి కొన్ని గంటలపాటు పెనుగులాడి చనిపోవడం, ఆ చిరుత కడుపులో రెండు కూనలు ఉండటం, ఆ కూనలు కూడా గర్భంలో చనిపోయిన విషయాలు శ్రీ పవన్ కల్యాణ్ గారి దృష్టికి వచ్చాయి. క్షేత్ర స్థాయి నుంచి అందిన ప్రాథమిక సమాచారాన్ని, శాఖాపరంగా ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించారు. ఘటన చోటు చేసుకున్న అనంతరం సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందించారనే విషయాన్నీ తెలియచేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లోనూ, అటవీ ప్రాంతాన్ని సమీప గ్రామాల్లో జంతువుల కోసం ఉచ్చులు వేసే వేటగాళ్ళు, ఆ తరహా నేరాలు చేస్తున్నవారిపై నిఘా ఉంచాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పొన్నూటిపాళెం ఘటనపై విచారణను పర్యవేక్షించాలని అటవీ శాఖ సలహాదారు శ్రీ మల్లికార్జునరావుకి దిశానిర్దేశం చేశారు.

## కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్‌షాప్




రాయచోటి ఏప్రిల్ 17 మనం న్యూస్: వ్యవసాయ శాఖ అన్నమయ్య జిల్లా – కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్షాప్ ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ బి చంద్ర నాయక్ గారు కిసాన్ డ్రోన్ పథకం మార్గదర్శకాలను వివరించారు ప్రభుత్వం రైతు సంఘాలకు 80% సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోంది రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి డ్రోన్ లు ఉపయోగించడం వల్ల పురుగు మందుల పిచ్చికారి ఖర్చు తగ్గుతుంది ఎకరం పిచ్చికారి 10 నిమిషాల్లో పూర్తి అవుతుంది అన్నమయ్య జిల్లాకు 34 డ్రోన్లు మంజూరయ్యాయి రైతు సంఘాలు తమ గ్రూపు ఖాతాలో 50% జమ చేయాలి మరియు బ్యాంకులు 50% రుణం జారీ చేస్తాయిడ్రోన్ గ్రౌండింగ్ తర్వాత ప్రభుత్వం రైతు గ్రూప్ ఖాతాకు 80% సబ్సిడీని విడుదల చేస్తుందిరైతు సంఘాలకు రుణాలు మంజూరు చేయడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉంది అని తెలిపారు డ్రోగో డ్రోన్స్ మరియు విహంగా డ్రోన్ల కంపెనీ ప్రతినిధులు తమ డ్రోన్ల ప్రత్యేకతలను వివరించారు కార్యక్రమంలో %వాణివీ% ఆంజనేయులు గారు, యూనియన్ బ్యాంక్ %వాతీ%.మేనేజర్ పి. ప్రసాద్ గారు పాల్గొన్నారు.